

'నీట్' ర్యాంకర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు

నీట్ లో 500. ర్యాంకు సాధించి ఆంధ్రప్రదేశ్లో ప్రతిష్టాత్మకమైన వెజాగ్లో ఆంధ్ర మెడికల్ కాలేజీ ఎంబిబిఎస్ సీటును కైవసం చేసుకున్న కందుకకూరుకి చెందిన షేక్ మస్కత్య బాషీద్ ను ఆదివారం ముస్లిం డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. మాజీవక్ఫ్ బోర్డు మెంబర్ షేక్ సందాని బాష మాట్లాడుతూ బాషిద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నాని కోరారు. నీట్‌లో అత్యుత్తమ ర్యాంకును సాధించి యువతరానికి ఆదర్శంగా నిలిచిన బాషిద్ భవిష్యత్తు మంచిగా ఉండాలని కార్యక్రంలో పాల్గొన్న ఎండిఒ బాధ్యులు ముస్తఫా, ఎం ఏ. నసీర్, షేక్ రసూల్, షేక్ షబ్బీర్, ఎండి. యూసుఫ్, షేక్ అక్బర్ బాషా, షైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రహీం తదితరులు ఆకాంక్షించారు.

రాజకీయం..రౌడీయిజం.. చట్టా పట్టాల్..!

ప్రశాంత సింహపురిలో నేడు అశాంతి రాజ్యమేలుతోంది.. ఒకప్పటి ఫ్యాక్షన్ జిల్లాలో హాయిగా ఉంటే.. నెల్లూరు జిల్లా మాత్రం కొత్తగోజులుగా రాజకీయ కల్లోలం... రౌడీయిజం...హత్యలు.. దాడులు...ఒక్కమేటి రాష్ట్ర రాజకీయాల్లో నెల్లూరు పేరు మారుమోగుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా రాజకీయాల్లోకి రౌడీలు ప్రవేశించడమే ప్రధానంగా కనిపిస్తోంది. గతంలోనే రాజకీయాలకు నెల్లూరు ప్రసిద్ధి...ఎందరో మహామహులు రాజకీయాలు నేర్చిన సింహపురి హింసారాజకీయాలకు కేంద్రంగా మారుతోంది... రాజకీయ పరిపక్వత లేని నేతలు రాజకీయాలను శాసిస్తున్నారు... పోలీసు వ్యవస్థ రాజకీయ నాయకుల చేతుల్లో కీలుబొమ్మగా మారడంతో నిర్వీర్యమైపోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా లాఠీకి స్వేచ్ఛ ఇచ్చి, రౌడీ, గుండా మూకలను అరికట్టకపోతే నెల్లూరు మరో రాజకీయ రక్త చరిత్ర సృష్టిస్తుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది..

- ప్రశాంత జిల్లాలో అశాంతి
- శాంతిభద్రతలకు విఘాతం
- పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- చేతులు కాలాక..ఆకులు పట్టుకుంటున్నారు..

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రాజకీయాలకు పెట్టింది పేరు.. పుచ్చలపల్లి సుందరయ్య, బెజవాడ గోపాలరెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి.. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జక్కా వెంకయ్య, ఎం. వెంకయ్య నాయుడు, పి మధు వంటి నేతలను రాష్ట్రానికి, దేశానికి అందించింది. అప్పట్లో హుందా రాజకీయాలు సాగాయి. ఇటీవల కాలంలో రాజకీయాల్లో పెను మార్పులు వచ్చాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున యువ రాజకీయ నేతలు రాజకీయాల్లో వచ్చారు. తమ వెంట జనం కోసం. ఎవరికి పడితే వారిని రాజకీయాల్లో పోత్సహించారు. ఒకప్పుడు రౌడీలు, గుండాలు తెర వెనుక ఉంటూ తమ పనితనం చూపేవారు. ఇటీవల ఎంపి, ఎంఎల్ఎలు పేరు చెప్పుకొని చోటా నేతలతో చట్టపట్టాల్ వేసుకు తిరుగుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నేతలకు అడుగులకు మడుగులొత్తుతున్నారు. జనాన్ని బెదిరిస్తూ, తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం నేరచరిత్ర అని చెబుతున్న వ్యక్తులు ఒకప్పుడు వైసిపి, ఇప్పుడు టిడిపిలోనూ కొనసాగుతున్నారు. శ్రీకాంత్ తొలుత వైసిపి నేతతో కలిసి తిరిగారు. ఆ సమయంలోనే తనకంటూ కొంత గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. గాలికి తిరిగే పిల్లబ్యాచ్ రౌడీలుగా మారారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి రాగానే అక్కడ నుంచి మళ్లీ టిడిపి నేతల దగ్గర చేరువచ్చుకుంటున్నారు. రాజకీయ నేతల అండ చూసుకొని పోలీసులను లెక్కచేయని పరిస్థితికి వెళ్లిపోయారు. చిల్లరపనులు చేస్తూ నేను ఎంపి, ఎంఎల్ఎ మనిషినంటూ తిరుగుతున్నారు. ఇదే సమయంలో పోలీసులు రౌడీ మూకలను గాలి కొదిలేశారు. ఇప్పుడు ఒక్కో ప్రాంతానికి రెండు, మూడు రౌడీ బ్యాచ్‌లు నగరమంతా తిరుగు తున్నారు..

ప్రశాంత జిల్లాలో అశాంతి..!

ప్రశాంత రాజకీయాలకు పెట్టింది పేరుగా ఉన్న నెల్లూరులో గత కొంత కాలంలో అశాంతి నెలకొంది. దీని వెనుక రౌడీమూకల హస్తం ఉందనే విమర్శలున్నాయి. కోవూరు మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో రౌడీ మూకలు ఇంటిపై దాడికి పాల్పడ్డారు. కోవూరుకు చెందిన టిడిపి నేతలు రౌడీలను ఉపయోగించుకొన్నారనే విమర్శలున్నాయి. సుమారు పది రోజులు ఆ వ్యవహారం నడిచింది. కోవూరుకు చెందిన అరుణ, శ్రీకాంత్ అంశం గత పదిహేను రోజుల నుంచి హల్ చల్ చేస్తోంది.

ఇందతా రౌడీల చుట్టే తిరుగుతోంది. తాజాగా నెల్లూరు రూరల్ ఎంఎల్ఎపై రౌడీలు హత్యకు కుట్ర అంటూ జరుగుతోన్న దానిలోను రౌడీల మూకల ప్రాత ఉంది. ఒకప్పుడు రాజకీయాల్లో ఎక్కడా కనిపించని రౌడీలు ఇప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఎందుకు కీలకంగా మారారో తెలియాల్సి ఉంది. కొందరు నాయకులు తమ రాజకీయ ప్రాభల్యం పెంచుకోడావడానికి, ప్రత్యర్థులను బెదిరించడానికి అప్పుడు వైసిపిలోనూ, ఇప్పుడు టిడిపిలోనూ రౌడీ మూకలను ఉపయోగించుకుంటున్నారనే విమర్శలున్నాయి.

పోలీసు వ్యవస్థ నిర్వీర్యం..!

ఒకప్పుడు ఎందరో పోలీసు అధికారులు పనిచేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా నిజాయితీగా తమ విధులు నిర్వహించారు. ఇప్పుడు ఆ పరిస్థితుల్లో పోలీసు వ్యవస్థ కనిపించడం లేదు. ఇందుకు ప్రభుత్వాలు కూడా ఒక కారణమే. ఇక్కడ పోస్టింగ్‌ల కోసం అధికారులు మంత్రులు, ఎంఎల్ఎ ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఓ సమర్థవంతమైన అధికారిని పోలీసు స్టేషన్‌లో నియ మించుకోడానికి ఎస్పికి అవకాశం లేదని తెలుస్తోంది. స్థానిక ఎంఎల్ఎలు ఎవరికి సిఫార్సు లేక ఇస్తేనే పోలీసులకు పోస్టింగ్‌లు ఇస్తున్నారు,. ఎంఎల్ఎ చెప్పిన పనులు చేయడం అధికారులకు అలవాటుగా మారిపోయింది. ఈ క్రమంలో రౌడీలు, గుండాలు, దొంగలను ప్రజా ప్రతినిధులు పెంచిపోషించారనే విమర్శ లున్నాయి. అందుకే పోలీసులు నేరస్తుల పట్ల సీరియస్‌గా వ్యవహరించలేదని తెలుస్తోంది. ఎప్పటి నుంచో నడుస్తోన్న ఈ తరహా వ్యవహారం ఇప్పుడు నెల్లూరు నగరాన్ని అతలా కుతలం చేస్తోంది. నెల్లూరు జిల్లాలో హత్యలు, దొంగతనాలు, ఎక్కువ కావడంతో నిత్యం పోలీసు ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు చివాట్లు పెడుతున్నట్లు తెలుస్తోంది. నిర్వీర్యం అయిపోయిన పోలీసు వ్యవస్థకు ఫుల్ పవర్స్ ఇచ్చి, పనిచేయిస్తే తప్ప నెల్లూరులో శాంతిభద్రతలు గాడిలో పడేలా కనిపించడం లేదు. ప్రజా ప్రతినిధులందరూ ఒక్కటై నెల్లూరులో ప్రశాంత నెలకొనేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లౌకికతత్వం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం..!

'లౌకిక ప్రజాతంత్ర వేదిక' ఆవిర్భావ సభలో 'విటపు'

సభలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంలో పొందుపరచిన లౌకికతత్వాన్ని ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ నియంతృత్వం వైపు అడుగులేస్తున్న నేపథ్యంలో లౌకిక తత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పనిచేయాల్సిన అవసర ముందని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రాజకీయ పార్టీలకతీతంగా 'లౌకిక ప్రజాతంత్ర వేదిక' ఏర్పాటు సభ జరిగింది. ఈ సభకు డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టరు బి.రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సభకు విటపు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో విటపుబాలసుబ్రమణ్యంతోపాటు విశ్రాంత తహశీల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె పరంధామయ్య,చలనం సామాజిక సంస్థ కార్యదర్శి చింతల జాషువా ,రిటైర్డ్ పంచాయతీరాజ్ ఉద్యోగి ఎం కష్టారావు, సంఘమిత్ర స్కూల్ కరస్పాండెంట్‌కె రవీంద్రారెడ్డి, ఐలు జిల్లా అధ్యక్షులు ఎస్ అంకయ్య, చైతన్య జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి విరగనబోయిన శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి మూల స్తంభాలుగా ఉన్న సెక్యులరిజాన్ని,(పజాస్వామ్యాన్ని రక్షించు కునేందుకు రాజకీ యాలకతీతంగా అన్ని సంస్థలు, ప్రజా సంఘాలు మేధావులు ఐక్యం కావాలని పేర్కొన్నారు. కులాలు మతాలు , ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడి స్వాతంత్రాన్ని సంపాదించుకున్నారని, ఆ స్వాతంత్రోద్యమ వారసత్వాన్ని బిజెపి కాలరాస్తుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తిలోదకాలిచ్చి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని దుయ్య బట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి అరి గల నాగేంద్ర సాయి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కె రాంబాబు హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రజాసంఘాల నాయకులు ఎం మోహన్ రావు, మాదాల వెంకటేశ్వర్లు, శంకర కిషోర్,ఎల్లంకి వెంకటేశ్వర్లు, ఆలూరు తిరుపాలు, మాదాల వెంకటకష్ణ,రిటైర్డ్ కార్మిక శాఖ అధికారి డాక్టర్ రాచపాలెం రఘు, డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, కె జయరామిరెడ్డి పాల్గొన్నారు. సభ అనంతరం మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం కన్వీనర్ గా 20 మందితో లౌకిక ప్రజాతంత్ర వేదిక' తాత్కాలిక కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

కరేడులో భూ సేకరణను వ్యతిరేకిస్తూ
3న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఉలవపాడు : కరేడులో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 3న సాయంత్రం 3 గంటలకు కందుకూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని కరేడు రైతు ఉద్యమ నాయకుడు, 139 బిసి కులాల జెఎసి రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కరేడు భూపోరాట రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. బలవంతపు భూసేకరణను ఏ విధంగా అడ్డుకోవాలనే విషయంపై విస్తతంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతుల ఆమోదం లేకుండా బలవంతంగా భూములు తీసుకునేందుకు ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. మరో వైపు పోలీసులు ఆంక్షలు విధిస్తూ రైతులు ఉద్యమం బాట పట్టకుండా నెలల తరబడి 30వ యాక్టును విధిస్తూ పోలీస్ శాఖ నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. ఈ అంశాలపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, అభ్యుదయవాదులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని రైతు ఉద్యమానికి సహకరించాలని ఆయన కోరారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరులోని అంకమ్మ ఆలయ పునర్‌నిర్మాణానికి ప్రజలు విరివిగా విరాళాలు అందిస్తున్నారు. రూ.4 కోట్ల వ్యయంతో అనివేటి మండప నిర్మాణం జరుగుతోంది. రాతి శిల్పాలతో అపురూపంగా రూపుదిద్దుకుంటున్న అనివేటి మండపానికి దివి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు. కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీకి విరాళం అందజేశారు.

వరిపంటను పరిశీలిస్తున్న సోమిరెడ్డి

రైతులను విస్మరించిన వైసిపి : సోమిరెడ్డి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :గత వైసిపి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను ఇబ్బందులకు గురి చేసిందని ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన తోటపల్లిగూడూరు మండలం ఈదూరు-కోడూరు జాయింట్ చెరువును పరిశీలించారు. చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, తమది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పే జగన్ ఐదేళ్ల పాలనలో రైతు భరోసా రూపంలో అన్నదాతలకు ఎగ్గొట్టింది. ఏకంగా 9 వేల 830 కోట్ల రూపా యలని విమర్శించారు. కర్షకులు అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ఎంతమాత్రం పట్టించుకోలేదన్నారు. వరి సహా ఇతర పంటల సాగు ఏటికేడు తగ్గిపోతున్నా ఉత్పత్తి పెరుగుతోందంటూ భుజాలు చరచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తమది రైతు పక్షపా తి ప్రభుత్వం అని ఆయన చెప్పారు. వైసీపీ ప్రభుత్వం చెరువు ఆయకట్టు లోతట్టు ప్రాంతంలో సన్న కారు రైతులు ఎకరాలు పండించుకునే వారని చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొమ్మి సురేంద్ర, వరిగొండ నాయకులు చిన్నబాబి రెడ్డి, మండల అధ్యక్షులు కొనతం రఘుబాబు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు వీరబోయిన గంగాధర్, తమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, మత్స్యకార నేతలు ఆవుల ము నిరత్నం, దొరబాబు, మన్నెం జితేంద్ర గౌడ్, చింత సీతారామయ్య బి శ్రీనివాసులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మహా గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంతోటపల్లి గూడూరు మండలం, వెంకన్నపాలెం గ్రామంలో అత్యంత గడప గడపకు మహా గౌడ చైతన్య యాత్ర ప్రారంభించారు. చైతన్య యాత్ర ము ఖ్య ఉద్దేశం గౌడ జాతి ఐకమత్యంగా ఉండాలని, పిల్లలకు ఉన్నతమైన చదువులు ఇవ్వాలని తద్వార సామాజి కంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, అంతేకాక సమాజంలో గౌడ జాతికి ఒక మంచి బ్రాండ్ ఇమేజ్ తీసు కు రావాలన్నదే గడప గడపకు మహా గౌడ్ చైతన్య యాత్ర ముఖ్య ఉద్దేశ్యమని ప్రతినిధులు పేర్కొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మన్నెం రాము గౌడ్, సర్వేపల్లి నియోజకవర్గం యువత ప్రధాన కార్యదర్శి కై తేపల్లి శ్రీనివాసులు గౌడ్, టిపి గూడూరు మండలం గౌర వ అధ్యక్షులు మన్నెం ప్రభాకర్ గౌడ్, కల్లుగీత కార్మికుల విభాగం అధ్యక్షులు కేతగాని పరంధామయ్య గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కైతేపల్లి బాబు గౌడ్, కైతేపల్లి ప్రవీ ణ్ గౌడ్, కాల్తీ రెడ్డి రవి గౌడ్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ రమణయ్యను అభినందిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

రమణయ్య సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కందుకూరు : ఎస్.ఐ. మాచవరం వెంకట రమణయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం కందుకూరు వెంగమాంబ ఫక్షన్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని పోలీస్ శాఖలో రమణయ్య సేవలు ప్రశంసనీయమన్నారు. కందుకూరు పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేసిన మాచవరపు వెంకట రమణయ్య చిరునవ్వుతో ఎవరిని నొప్పిచకుండా ఉద్యోగం చేసి అందరి మన్ననలు పొందారని ఎంఎల్ఎ ఇంటూరి కొనియాడారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. సబ్ డివిజన్ అధికారి వి. బాలసుబ్రమణ్యం వెంకట రమణయ్య సేవలను కొనియాడారు.కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు,మహర్షి శ్రీను, గుర్రం మాల్యాద్రి,కోమ్మి వెంకట ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు కె అంకమ్మ,మహేంద్ర నాయక్, ప్రదానోపాధ్యారాలు ద్రోణాదుల అనురాధ ఉన్నారు.

గణేష్ పూజల్లో 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణ పరిధిలోని దూబగుంట గ్రామంలో నిర్వాహకుల ఆహ్వానం మేరకు కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి వినాయక మండపంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్తులు, మహిళలు, యువకులు ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. వార్డు అధ్యక్షుడు అత్తంటి నాగేంద్రరావు, అత్తంటి శ్రీహరి నాయుడు, అత్తంటి మధు, గుండవరపు లక్ష్మీనరసింహం మహిళలు ఉన్నారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు :మండలంలోని కోడూరు సముద్ర తీరం లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం కావడంతో కుటుంబాల సమేతంగా కదలి వచ్చి తీరం వెంబడి సందడి చేశారు. యువత ఆ టపాటలతో సందడి చేసింది. ఎటువం టి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా తీరం వెంబడి ఎస్ఐ వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో పోలీసు బం దోబస్త్ ఏర్పాటు చేశారు.అధిక సం ఖ్య లో తరలి వచ్చిన ప్రజలతో కోడూరు సముద్ర తీరంలో పండుగ వాతావరణం నెలకొంది.

అధ్వానంగా రోడ్లు..

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు జనార్ధన కాలనీలోని రోడ్లు చినుకు పడితే చిత్తడిచిత్తడిగా మారి ప్రజలు నడవడానికి వీలుకాని విదంగా తయారయ్యాయి. శనివారం పడిన చిన్నపాటి వర్షానికి కందుకూరు పట్టణం జనార్ధన కాలనీ కరెంట్ ఆఫీస్ పక్క లైను నాలుగో ఆర్డర్ రోడ్డులో చిన్నపాటి వర్షానికి నీరు రోడ్డు మొత్తం నిండిపోయి నడవడానికి కూడా వీలు లేనంతగా మారి పోయింది. కందుకూరులో అభివద్ధి జరుగుతుందో అర్థం కావడం లేదని ప్రజలు బాధపడుతున్నారు. ఇలా చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీళ్లు వస్తుంటే ఇక ప్రజలు ఎలా జీవనం సాగించాలో అర్థంకాని పరిస్థితి. మున్సిపల్ కమిషనర్ కందుకూరు పట్టణంలో ఇలాంటి చిన్నపాటి వర్షానికి రోడ్డుపై నీళు నిలువ ఉంటున్న జనార్ధన కాలనీపై దష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అధ్వానంగా ఉన్న రహదారి

నూతన పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలి

30 శాతం ఐఆర్ ప్రకటించాలి - యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నూతన పిఆర్‌సి కమిటీని నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు హాజరైయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు వివిశేషులు అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర అద్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వారిచ్చిన హామీల మేరకు పిఆర్సి కమిషన్ నియమించి వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిఏలను ఇతర ఆర్థిక అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాఠశాలలను బలోపేతం చేసేందుకు యుటిఎఫ్ కార్యకర్తలు శ్రమించాలన్నారు. అందుకు ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించిన జిల్లా శాఖను అభినందించారు ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేసి వారిచే బోదనేతర పనుల నుండి మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలలో సెల్ ఫోన్ రహిత బోధనకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని, ఈ విద్యా సంవత్సరంలో ఎన్రోల్మెంట్ పెంచిన పాఠశాల ఉపాధ్యాయులను గుర్తించి అభినందించాలని తీర్మానించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతి శర్మ గత కౌన్సిల్ కాలము నుండి నేటి వరకు జిల్లా కమిటీ చేసిన కార్యక్రమాలను భవిష్యత్తు కర్తవ్యాలను నివేదికను వినిపించారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవ కోటేశ్వరరావు మాట్లాడుతూ బోధ నేతల కార్యక్ర మాలను ఉపాధ్యాయుల నుండి తొలగించాలని సెప్టెంబర్ నెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తామని పిఆర్‌సి, ఐఆర్, డిఎలు ఇతర ఆర్థిక అంశాలను సాధనకు ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాలలో ధర్నా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. అక్టోబర్ 7వ తేదీన జిల్లాస్థాయిలో ధర్నా నిర్వహించాలని, అక్టోబర్ 21వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాబు రెడ్డి , జన విజ్ఞాన వేదిక నాయకులు కష్టారెడ్డి ఉదయ భాస్కర్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిల్లా కౌన్సెలర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

'ఎన్‌టిఎ' నూతన నాయకత్వం

పిఆర్‌టియులో చీలిక - మరో సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

పిఆర్‌టియు ఉపాధ్యా సంఘంలో వచ్చిన చీలికతో జిల్లాలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఎ) ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారరం నగరంలోని ఆపార్టీ కార్యాలయంలో నూతన నాయకత్వం ఎన్నికైయింది. అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ ఎన్నికలలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాటకం తిరుమలయ్య, సిహెచ్ .చెన్నయ్య , జిల్లా గౌరవాధ్యక్షులుగా డి.. వెంకట్రాజు, క్రమశిక్షణ సంఘ అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా రాంబాబు నాయుడు, ఆత్మకూరు ఇన్‌ఛార్జిగా రహమతుల్లా ను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు వివిధ ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడుతూ... బదిలీ అయి రిలీవర్ లేక ఆగిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, బుక్ లెట్ విధానంలో పరీక్షల నిర్వహణను పునఃసమీక్షించాలని, ఉపాధ్యాయులకు రావలసిన అన్ని ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించే విధంగా కార్యాచరణ రూపొందించాలని కోరారు. , నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డి రమేష్ బాబు , రాష్ట్ర మాజీ అధ్యక్షులు నడిపినేని వెంకట్రావు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ , ఎస్ కె రఫీ, హరేంద్ర ,సురేష్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



ఎన్‌టిఎ నూతన నాయకత్వం ఇదే..

వైఎస్ఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

ఉలవపాడు : ఈనెల 2న మంగళవారం ఉదయం 10 గంటలకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16 వర్ధంతి సందర్భంగాఉలవపాడులో ఆయన విగ్రహాన్ని కి పూలమాలలు వేసి నివాళి అర్పించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.పోతురాజు తెలిపారు. మం డలంలోని అన్ని గ్రామాల్లోని వైసిపి శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరులో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం ఆదివారం ప్రారంభమైంది. గుడ్లూరులోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, రెడ్డిపాలెం రజక పాలెం ఆ తదితర ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలు నిమజ్జనం కోసం తరలించారు. మెయిన్ బజార్లో ఊరేగింపు కార్యక్రమం కోలహలంగా సాగింది. రామాయపట్నం దగ్గర సముద్రంలో నిమజ్జనం చేసేందుకు భారీ ఎత్తున గణేష్ విగ్రహాలు తరలించారు. గత నాలుగు రోజులుగా అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి.

గణేష్ నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు :గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఎక్కువగా జరిగే ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద భద్రతా చర్యలను ఎస్‌పి జి.కృష్ణకాంత్ పోలీసు సిబ్బందితో పరిశీలించారు. ఆదివారం ఆయన ఇరుకళల పరమేశ్వరి దేశస్థానం ప్రాంతంలో వినాయక నిమజ్జన ఘాట్ ప్రాంతాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో బాణాసంచా కాల్చేటప్పుడు నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బారికేడ్లు, నాటు పడవలు, సిసి కెమెరాలు, రాకపోకల మార్గాలు, నిమజ్జన ప్రాంతాలు, హారతి, భక్తుల రద్దీ, ప్రసాదాల పంపిణీ, వాహనాల పార్కింగ్, గజ ఈతగాళ్లు, భారీ క్రేన్లు, డ్రైవర్ల జాగ్రత్తలపై ప్రత్యేక దష్టి సారించాలని చెప్పారు. పిల్లలు, వద్ధులు నిమజ్జన ప్రాంతాలకు రావద్దని సూచించారు. లైటింగ్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ట్రాఫిక్ డైవర్షన్‌కు ప్రజలు సహకరించాలని సూచించారు.

'కావ్య' అన్నవరంలో అక్రమ వ్యాపారాలు

వైసిపి నేతలు ఆగ్రహం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి అన్నవరంలో అక్రమ వ్యాపారాలు చేస్తున్నారని, అందుకే ఎవరినీ అక్కడకు రానివ్వకుండా నాటకాలు అడుతున్నారని వైసిపి నాయకులు మండిపడ్డారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఆపార్టీ నేతలు మీడియాతో మాట్లాడారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్, విడి విడిగా మీడియాతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ కావలి ఎంఎల్ఎ కావ్య కష్ణారెడ్డి , కాకాణి గోవర్ధన్ రెడ్డి , ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి , మాజీ శాసనసభ్యులు ప్రతాప్ కుమార్ రెడ్డి గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో అనేక అక్రమాలు దుర్మార్గాలు దౌర్జన్యాలతో పాటు చీకటి సామ్రాజ్యాన్ని స్థాపించారని విమర్శించారు. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కావ్య కష్ణారెడ్డి చేసే దుర్మార్గాలను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా బయటపెట్టేందుకు ప్రయత్నించారని, అందుకు మా నాయకులపై తప్పుడు కేసులు బనాయించి హత్యాయత్నం కేసు నిసిగ్గుగా నమోదు చేయించారన్నారు. హైదరాబాద్ నగరాల్లో పరిమితమైన మనీ స్కీమ్ ని నెల్లూరుకు తీసుకొచ్చి కావలి ప్రజల జీవితాలను సర్వనాశనం చేశారన్నారు. గొర్రెల ఫామ్ ఏర్పాటు చేసి కోట్లు దండుకొని ప్రజలు నట్టేట ముంచారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని తమ నాయకులను అడ్డుకుంటున్నారని విమర్శించారు.

మాట్లాడుతోన్న వైసిపి నాయకులు నాగార్జున

బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం 16వ వార్డు చంద్రబాబు నాయుడు కాలనీలో వర్ష వుడ్ బ్యాడ్మింటన్ కోర్టును కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులతో సరదాగా కాసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. సౌకర్యవంతంగా కోర్టును ఏర్పాటు చేసిన యాజమాన్యంను ఎంఎల్ఎ అభినందించారు.

రూ.45 వేలకు లడ్డువేలం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు బజారుసెంటర్‌లో యూనియన్ బ్యాంకు సమీపంలో గణేష్ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఉత్సవాలలో భాగంగా ఆదివారం లడ్డు వేలంలో మెతుకు రాజేశ్వరి కుటుంబ సభ్యులు రూ.45వేలకు లడ్డును దక్కించుకొన్నారు. చివరి రోజున 108 ప్రసాదాలతో స్వామి వారికి నివేదన సమర్పించారు. విశ్వనాథరావుపేట పాత ఎస్ఆర్‌కె ఇంగ్లీష్ మీడియం పాఠశాల దగ్గర గణేష్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జరిగిన లడ్డు వేలంపాటలో తోట ప్రసాద్ రూ.25,600లకు దక్కించుకున్నారు. విశ్వనాథరావుపేట శ్రీహరిరెడ్డి ఇంటి వద్ద గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డు పాటను విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి శ్రీనివాసులు రూ.10,600లకు దక్కించుకున్నారు. రామస్వామి పాలెం శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయం వద్ద గణేష్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. 5వ రోజు కావడంతో మండలంలో వినాయక విగ్రహాలను ఊరేగించి సముద్రంలో నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు శివ, కృష్ణ, నవీన్, సాయి, శ్రీను, నాగేంద్రబాబు, మధు, నేతాజీ, శ్రీహరి రెడ్డి, దయాకర్ రెడ్డి, చైతన్య, నాగేంద్ర, లేళ్లపల్లి వెంకట కిషోర్, ధన్యాసి శ్రీధర్, పొంతగాని శివకోటయ్య, దార మాలకొండయ్య, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంధ మహోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ఏఎస్పేట గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాముల వారి ధర్మపత్ని శ్రీ హబీబా ఖాతూన్ దొరసానమ్మ అమ్మ జాన్ స్వాములవారి 252వ గంధ మహోత్సవంలో భాగంగా గంధం దంచే కార్యక్రమాన్ని గంధ మహల్‌లో దర్గా ఇఒ షేక్ మొహమ్మద్ హుస్సేన్, దర్గా వంశస్థులు ఎస్‌జిఎన్ ఫయాజ్ అహ్మద్, షకీల్ అహ్మద్ గౌస్‌బాషా భక్తులు ప్రత్యేక ఫాతిహాలు చదివి ప్రారంభించారు. మహిళా భక్తులు భారీగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గంధం దంచారు. ఏడాదికోసారి జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని గంధం దంచడం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. భక్తులకు దర్గా వంశస్థులు మంచినీరు ఏర్పాటు చేయగా వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో క్యూలైన్ల కోసం బారికెట్లు షామియానాలు, తదితర ఏర్పాట్లను చేశారు.

ఘనంగా గణపతి నిమజ్జనోత్సవాలు

ప్రజాశక్తి-ముత్తుకూరు

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి మహోత్సవాలు ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గణపతి నిమజ్జనం కార్యక్రమాలు కృష్ణపట్నం సముద్ర తీరంలో కోలాహలంగా జరుగుతున్నాయి. ఆదివారం పలు గ్రామాలకు చెందిన గణపతి విగ్రహాలను వాహనాల్లో తీసుకువెళ్ళి సముద్రంలో నిమజ్జనం చేశారు. దాంతో సందడి వాతావరణం వాతావరణం నెలకొన్నది. ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి ఈ కార్యక్రమాలను జరిపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

వివాహ వ్యవస్థను కాపాడే బాధ్యత కుటుంబాలదే..

ప్రజాశక్తి-కావలి

నేటి సమాజంలో సంక్షోభంగా మారిన "వివాహ వ్యవస్థను కాపాడుకునే బాధ్యత కుటుంబాలపైనే మాత్రమే ఉందని, ఆదివారం కలయిక విజ్ఞానకేంద్రంలో జరిగిన" వారం వారం చర్చాగోష్టిలో కలయిక విజ్ఞానకేంద్రం మిత్ర బృందం వెల్లడించారు. కలయిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మిత్ర బృందం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వారం వారం చర్చాగోష్టిలో భాగంగా నేటి సమాజంలో వివాహవ్యవస్థ " అంశంపై చర్చ జరిగించారు. సి.శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నక్కా సాయిరాం ప్రసాద్, కె.గోపీకృష్ణ, ఎం.కవిత, ఎం.రజనీకాంత్, జి.రామన్న, జి.రాంప్రసాద్, చన్నా వెంకట్రామయ్య, వస్తాని భాషా, ఎంవివి ప్రసాదరావు, బొల్లినేని రామకృష్ణ, వెంకట నరసారెడ్డి, పి.రమేష్, ఎం.పార్వతి శంకర్, తదితర మిత్రబృందం పాల్గొని చర్చలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. భారతీయ సంస్కృతిలో 'వివాహ వ్యవస్థ' అత్యంత పవిత్రమైనదని, సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, పరస్పర విశ్వాసం, ప్రేమానురాగాలు, సామరస్యం, ఆత్మీయబంధం ఏర్పరిచి కుటుంబ బంధాలు బలోపేతం చేయడానికి వివాహ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని సభ్యులు పేర్కొన్నారు. ఇంతటి గొప్ప వ్యవస్థ ఆధునిక యుగంలో కూడా కొనసాగుతున్నా, అయినా, ఆర్థిక, సామాజిక పరిస్థితులు, మనస్తత్వాల్లో వ్యత్యాసాలు, గొంతెమ్మ కోరికలు, ఇగో ఇజం, వ్యక్తిగత స్వేచ్ఛ పెద్దల అనవసర ప్రమేయం వివాహాలను ప్రభావితం చేస్తూ, విడాకుల దాకా రావడం విచారకరమన్నారు. ఉద్యోగస్తులైన దంపతులు సర్దుబాటు గుణం లేక, చెప్పుడు మాటలతో దుష్ప్రభావాలకు గురవుతున్నారని, పరస్పరం అనుమానాలకు లోనవుతున్నారని, కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు తలెత్తుతూ గొడవలు కొండంత చేసుకుంటూ వివాహాన్ని ధ్వంసం చేసుకుంటున్నారని, తమ సంతానం ఆ ప్రభావంతో భవిష్యత్తును కోల్పోయి ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్యాశుల్కం నుండి వరకట్నం వరకూ వివాహ బంధాన్ని నాశనం చేసే కట్టుబాట్లేనని, "ఇంట్లో మగ పిల్లలైతేనే తమకొక్కరే తాము నిలబడేలా చదివించి, విలువలను నేర్పి పెంపకం అందించి, వివాహ విషయంలో పిల్లల స్వంత అభిప్రాయాలను తెలుసుకుని వారికి పెళ్ళి చేయడం సముచితమన్నారు. మానవ సంబంధాలను పటిష్టపరిచే విధంగా వివాహ వ్యవస్థను కాపాడే బాధ్యత సమాజంపైనే ఈ దృష్టితో ప్రతికుటుంబం ఆలోచించి వివాహ వ్యవస్థ పరిరక్షణకు కృషి చేయాలని కలయిక విజ్ఞానకేంద్రం మిత్రబృందం పిలుపునిచ్చారు.

రైతాంగ వ్యతిరేక విధానాలు ఆపాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను వెనక్కు దోసి రైతులను రక్షించుకోవడం ద్వారానే వ్యవసాయాన్ని కాపాడుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు అన్నారు. ఉదయగిరి ఏరియా రైతుసంఘం 5వ మహాసభ ఆదివారం ఉదయగిరిలో ఎం.వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. సీనియర్ రైతు నాయకుడు చింతలబోయిన రత్తయ్య సంఘం పతాకాన్ని ఎగురవేశారు. సంఘం ఏరియా కార్యదర్శి కాకు వెంకటయ్య కార్యదర్శి నివేదిక పెట్టారు. నివేదికపై ఐదుగురు మాట్లాడారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నేడు మోసం చేసి తరిమి వేసి వ్యవసాయాన్ని అదాని, అంబానీలకు అప్పగించే పనిని వేగవంతం చేశాయన్నారు. భూసంస్కరణలకు తిలోదకాలు ఇచ్చే రకంగా, భూ సేకరణచట్టంలో పలు మార్పులు చేయడం ద్వారా సంపన్న వర్గాలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కార్పొరేట్ సంస్థలకు పెద్దఎత్తున భూములు కట్టబెడుతున్నారు. రైతులు ప్రకృతి వైపరీత్యాలను భరించి, కరువు వరదలు ఎదుర్కొని పంటలు పండిస్తుంటే వారికి కనీస మద్దతు ధర అందేలా చట్టం తెచ్చేందుకు కేంద్రం నిరాకరిస్తున్నారు. వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చిందని తెలిపారు. వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్తుకు మంగళం పాడేందుకు స్మార్ట్ మీటర్లు పెట్టటం మొత్తం విద్యుత్ సంస్థని అదానీకి అప్పగించే కుట్ర కేంద్రం చేస్తే రైతుల పోరాటంతో ప్రధాని మోడీ వ్యవసాయ చట్టాలు వెనక్కు తీసుకొన్నారని, స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ఎత్తులు వేస్తున్నారని తెలిపారు. కార్మిక శ్రమ శక్తిని కారు చౌకగా దోచుకోనేందుకు రోజుకి 12 గంటలు పని ప్రవేశపెట్టేందుకు వెనుకాడలేదని ఐటి రంగంలోనూ 14 గంటల పని ఉండాలని సలహా ఇస్తుందని దుయ్యబట్టారు. కేంద్రాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నూటికి నూరుశాతం అనుసరిస్తున్నదని, ఈ పరిస్థితులలో వ్యవసాయంలో ఉన్న రైతులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు, కార్మికులు కలుపుకొని రైతాంగ వ్యతిరేక విధానాలను వెనక్కు కొట్టి వ్యవసాయాన్ని కాపాడుకోవటానికి ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకుడు కోడె రమణయ్య సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాకు విజయ, రైతుసంఘం సభ్యులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

'ఉపాధి' బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య

ఉపాధి హామీ పనులలో కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల 3వ మహాసభ అనంతసాగరం అతిథి గృహం వద్ద నిర్వహించారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఉండే బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తుందన్నారు. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయి డబ్బులు విడుదల చేయలేదని వెంటనే కూలీల డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలగే గ్రామాల్లో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వల్ల పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కావున ఉపాధి హామీ పనులు ఎక్కువగా కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు, పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని దాని కోసం వ్యవసాయ కార్మిక సంఘం భూ పోరాటం నిర్వహిస్తామన్నారు. అనంతరం 13మందితో నూతన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నికైంది. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా బందుల వెంకట రమణ, నాగులూరు వెంకటేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా, జనవిజ్ఞాన వేదిక నాయకులు గాడి సుధాకర్, రైతు సంఘం సీనియర్ నాయకులు ఉప్పలపాడు మస్తాన్, రైతుసంఘం మండల కార్యదర్శి సత్తార్, అన్ని గ్రామాల వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పూర్వ ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు

ఎస్ఎఫ్ఐ పూర్వ నేత, లెక్చరర్ వేదవతి సంతాప సభ

ప్రజాశక్తి-కావలి

ఎస్ఎఫ్ఐ పూర్వ నేత, కాంట్రాక్ట్ అధ్యాపకుల నాయకురాలు వేదవతి సంతాప సభను ఆదివారం కావలి సిపిఎం ఆఫీసులో సి.హెచ్. కల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ పూర్వ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ వేదవతి ధైర్యవంతురాలు, సామాజిక స్పృహ కలిగిన వారన్నారు. ఆమె విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పోరాటాలు నిర్వహించారన్నారు. జవహర్ భారతి కళాశాలలో లేడీ రెప్రజెంటేటివ్‌గా విద్యార్థి సంఘ ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ అయిన తర్వాత, లెక్చరర్ల హక్కుల కోసం, సౌకర్యాల కోసం పోరాడిన ధీరశాలి అని కొనియాడారు. అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమం, మహిళా ఉద్యమాల్లో పాల్గొన్నారని వక్తలు కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జే.శ్రీనివాసులు, టి.మాల్యాద్రి, పి.జానకిరామ్, యస్.వెంకయ్య, పి.పెంచలయ్య, బి.శ్రీదేవి, కాత్యాయని, కే.హరనారపరెడ్డి, వేదవతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విధేయతకు నిదర్శనం 'కర్రా'

- ఉద్యోగ విరమణ సన్మానంలో వక్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్


ఉపాధ్యాయుడు కర్రా దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వినయానికి, స్నేహానికి, విధేయతకు ఒక నిదర్శనానికి ముందుకు సాగుతూ ఎదిగిన వ్యక్తి ఉపాధ్యాయుడు కర్రా నాగేంద్ర అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఆది ఆంధ్ర పాఠశాలలో కర్రా నాగేంద్ర రావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంఘాల నాయకులు, అభిమానులు విద్యార్థుల నడుమ ఉద్యోగ విరమణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు రొట్టె వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కర్రా నాగేంద్రరావు, చిన్నతనం నుండి ఎంతో వినయ విధేయతలతో క్రమశిక్షణతో ఆయన జీవితం ఎదుటివారిని చిరునవ్వుతో ఎలాంటి కల్మషం లేకుండా పలకరించడం ఆయన నైజమన్నారు. ఉపాధ్యాయుడు పట్టెడ మురళి కర్రా నాగేంద్రరావు బయోగ్రఫీ చదివి వినిపించారు. 1964 జనవరి 19న కర్రా నాగేంద్రరావు హనుమంతయ్య అచ్చమ్మ దంపతులకు జన్మించారన్నారు. ఆ దంపతులకు ముగ్గురు కుమారులు రెండో కుమారుడు కర్రా నాగేంద్రరావు బికాం, బిఇడి పూర్తి చేసి 1997 వింజమూరు మండలం ఊటుకూరులో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో జాయిన్ అయ్యారని తెలిపారు. 28 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసే ఎందరో విద్యార్థుల ఉన్నతికి కృషిచేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని కొనియాడారు. ఆత్మకూరు పట్టణంలో ఆది ఆంధ్ర పాఠశాలలో విద్యార్థులతో స్నేహభావంతో ఉంటూ విద్యతోపాటు ఆటపాటలు నేర్పిస్తూ అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఆయనకు సతీమణి కొండమ్మ బికాం, బిఇడి, స్పెషల్ ఇఎన్‌డి, హెచ్‌పిటి సంతానం ఇద్దరు కుమార్తెలు నవ్యశ్రీ ఎంబిబిఎస్, మధు శ్రీ బిటెక్ పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు లక్కు కృష్ణ ప్రసాద్, సిపిఎం నేత గంటల లక్ష్మీపతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు బి.శ్రీనివాసులు, పి.వేణుగోపాల్, నాయకులు మాస ప్రసాద్, ఇందూరు చంద్రమోహన్ రెడ్డి, పాణ్యం పెంచలయ్య, వెండి శ్రీనివాసులు, అనిల్ అపస్, హరికృష్ణ జన విజ్ఞాన వేదిక, వెంకటరెడ్డి, ప్రసాద్ ఉపాధ్యాయులు, బత్తల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ వెంకట్రావ్

నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - ఉదయగిరి

సర్కిల్ పరిధిలోని వినాయక నిమజ్జనం చేసే కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలని సిఐ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్ఐ కర్ణాటక ఇంద్రసేనారెడ్డి ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల సమీక్షలు ఆయన పాల్గొని మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల గణేష్ ఉత్సవాలు జరిపే కమిటీ సభ్యులు ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలు జరుపుకోవాలని కోరారు. ఇటీవల కలిగిరి అప్పసముద్రం గ్రామాల్లో జరిగిన ఘటనను ఉద్దేశించి ఈ సమావేశంలో సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. నిమజ్జన సమయంలో బాణసంచా పేల్చే విషయంలో జాగ్రత్తగా ఉంటూ నీటి వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్కిల్ పరిధిలో 55 ప్రాంతాలలో వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తలను పాటిస్తూ ప్రశాంతత వాతావరణం నిమజ్జనం చేసుకోవాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణేష్ నిమజ్జనంలో విషాదం

ప్రజాశక్తి-కావలి

కావలి మండలం చెన్నాయి పాలెం సముద్రంలో ఆదివారం గణేష్ నిమజ్జనం కోసం వెళ్లిన పులి లక్ష్మి (16) అనే యువతి ప్రమాదవశాత్తు సముద్రంలోమునిగి మరణించింది. పులిలక్ష్మిని వెంటనే కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వైకుంఠపురం పిజి సెంటర్ ప్రాంతానికి చెందిన గోవిందరాజు – పోలమ్మ కూతురుగా గుర్తించారు. కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపైనే థర్మల్ కేంద్రాల బూడిద..

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ముత్తుకూరు

ఎపి జెన్కో రోడ్డు మార్గంలో రోడ్డుపైన థర్మల్ కేంద్రాల బూడిద గుట్టలుగా ఉంది. నాలుగు రోజుల నుంచి ఈ బూడిద రోడ్డుపై ఉన్నప్పటికీ పరిశ్రమల అధికారులు కానీ, ప్రభుత్వ అధికారులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలు ఈ బూడిదపై వెళ్తుండగా బూడిద దుమ్ము గాల్లోకి లేస్తుంది. దాంతో కళ్ళల్లో బూడిదపడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్గంలో ప్రభుత్వ అధికారులు తోపాటు థర్మల్ కేంద్రం అధికారులు కూడా ప్రయాణిస్తున్నప్పటికీ బూడిద గుట్టను తొలగించాల్సిన ఆలోచన చేయకపోవడం దారుణమని జనం అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బూడిదను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును కలిసిన జిల్లా సాధన సమితి సభ్యులు

ఉదయగిరి జిల్లాకు మద్దతివ్వాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్రంలోనే వెనకబడివున్న ఉదయగిరి పరిసర మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లా చేయాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడును జిల్లా ఉద్యమ నాయకులు ఆదివారం వెంకటాచలంలోని స్వర్ణ భారతి ట్రస్టులో కలిసి కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యమ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల, డివిజన్ల, మండలాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రవర్గ ఉపసంఘాన్ని నియమించి ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సందర్భంగా ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఆయనను కలిశారు. నియోజవర్గ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించి, ఇక్కడి స్థిగతులన్నీ అవగాహన ఉన్నందున ఉదయగిరి జిల్లాగా ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం వద్ద ఉదయగిరి జిల్లా ప్రతిపాదనలు చేస్తే ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని 8 మండలాలను మూడు ముక్కలుగా చేసి కావలి కందుకూరు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లలలో కలిపిందని వివరించారు. అన్ని రంగాలలో వెనకబడివున్న నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమని వారు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామి రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎల్ సి రమణా రెడ్డి, నియోజకవర్గ బిజెపి నాయకులు ఎం.బాలకృష్ణరెడ్డి, జిల్లా సాధన కమిటీ నాయకులు ఎండి ఖాజా, పాముల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వింజమూరు

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు మండలాన్ని మినహాయించి, ఏడు మండలాలకు సంబంధించిన 39 మంది బాధితులకు సుమారు రూ.50 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి ఆదివారం బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా వైద్యం అందని వారికి సిఎం సహాయ నిధి నుండి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ప్రభుత్వం అందిస్తుంద న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రభుత్వానికి అందరం అండగా ఉండాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నానని మీరందరూ తోడ్పాటును అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు గూడా నరసారెడ్డి, సిహెచ్ బయన్న, మధు మోహన్ రెడ్డి, బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మరియు సీనియర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబు నాయుడు, యారవ కిష్టయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లినేని వెంకట రామారావు, మంచాల శ్రీనివాసులు నాయుడు, కోడూరు నాగిరెడ్డి, బొజ్జ నరసింహులు, నల్లి పోగు రాజా, ఏగినేని శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.

గాయపడిన చిన్నారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉదయగిరి



మండల పరిధిలోని అప్పసముద్రం గ్రామంలో శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనంలో బాణసంచా పేలి పాక్షికంగా గాయపడిన 9మంది చిన్నారులకు వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు, చారిటబుల్ ట్రస్ట్ అధినేత చేజర్ల సుబ్బారెడ్డి గ్రామంలో పర్యటించి బాధితులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పాక్షికంగా గాయపడిన ముగ్గురు చిన్నారులకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. అలాగే ఆత్మకూరులో చికిత్స పొందుతున్న మరో ముగ్గురికి రూ.20 వేలు, నెల్లూరులో చికిత్స పొందుతున్న మరో చిన్నారికి రూ.25 వేలు, మరొకరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.1.20లక్షలు అందజేశారు.

'డిబిఎస్'లో ప్రతిభ అవార్డులు అందజేత

ప్రజాశక్తి-కావలి

అవార్డులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా పురస్కరించుకొని దామిశెట్టి శ్రీనివాస్ నాయుడు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందచేస్తామని కళాశాల సెక్రెటరీ, డాక్టర్ దామిశెట్టి.బాల సురేష్ బాబు, కళాశాల కరస్పాండెంట్ దాంశెట్టి సుధీర్ నాయుడు తెలియజేశారు. 3వ త్రీ ఏ సైడ్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు డిబిఎస్ ఇంజనీర్ కళాశాలలో జరిగాయి. ఈ పోటీలలో కర్నూలు, చిత్తూరు, నంద్యాల, ప్రకాశం, కాకినాడ, వెస్ట్ గోదావరి, అనంతపూర్, సత్య సాయి తిరుపతి, బాపట్ల ఈ జిల్లాల నుండి పోటీల్లో పాల్గొన్నారు. ఈ జిల్లాల నుండి మొత్తం 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అండర్ -17 గర్ల్స్‌లో అనంతపూర్ ఫస్ట్ ప్లేస్, ప్రకాశం సెకండ్ ప్లేస్, నెల్లూరు తాడ్ ప్లేస్ గెలుపొందారు. అదే క్రమంలో అండర్17 బాయ్స్‌లో ఫస్ట్ ప్లేస్ ప్రకాశం, సెకండ్ ప్లేస్ నెల్లూరు, థర్డ్ ప్లేస్ అనంతపూర్ బాలికల బాలురులో విద్యార్థినీ విద్యార్థులు గెలుపొందారు. ఇక్కడ గెలుపొందిన వారు మహారాష్ట్ర షోలాపూర్‌లో పాల్గొంటారు. డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి త్రీ ఏ సైడ్ వాలీబాల్ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ బాల సురేష్ బాబు, కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ దామోదర్ రెడ్డి, డిబిఎస్ ఇంజనీర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్ కుమార్, ఇతర జిల్లాల నుండి సెక్రెటరీ నరసింహ మూర్తి, అశోక్, సంజయ్, ప్రసన్నకుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫయాజ్‌కు గంధ మహోత్సవ బాధ్యతలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల కేంద్రం రహమతాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాములవారి దర్గా వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో దర్గా ఇఒ షేక్ మొహమ్మద్ హుస్సేన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజరత్ స్వామి వారి ధర్మపత్ని శ్రీ హబీబా ఖాతూన్ దొరసానమ్మ (ఉరఫ్ అమ్మజాన్) వారి 252వ గంధ మహోత్సవం ఎత్తడానికి తమకు అవకాశం కల్పించాలని దర్గా సంబంధీకులైన, 1.ఎస్ జి ఎన్ హఫీజ్ పాషా, 2. ఎస్.జి.ఎన్.ఫయాజ్ అహ్మద్, 3.ఎస్. జి.ఎన్. నఫీస్ పాషాలు రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు చైర్మన్ హాజీ షేక్ అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో వారిని విచారణకు పిలిపించగా ఫయాజ్ అహ్మద్ హాజరు కాగా నఫీజ్ గైర్హాజరు అయ్యారని, హఫీజ్ పాషా తన న్యాయవాది ద్వారా, సామాజిక మాధ్యమంలో అభ్యంతరం వ్యక్తం చేశారని, వాటన్నింటినీ పరిశీలించిన రాష్ట్ర సిఇఒ షేక్ మొహమ్మద్ అలీ చైర్మన్, అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో గత రెండు సంవత్సరాల నుండి గంధ మహోత్సవంలో ఎస్. జి. ఎన్. ఫయాజ్ అహ్మద్‌కు ఈసారి కూడా యథావిధిగా అవకాశం కల్పిస్తూ తాత్కాలిక ఉత్తర్వులను జారీ చేసినట్లు దర్గా ఇఒ తెలిపారు. ఈ ఉత్తర్వులతో గత నాలుగు రోజుల నుంచి గంధ మహోత్సవంలో తమకు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని, తేదీల వారీగా హఫీజ్ పాషా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన, నామమాత్రంగా మారటం విశేషమన్నారు. దాన్నిబట్టి చూస్తే, దర్గాకు సంబంధించిన పూర్తి అధికారాలు వక్ఫ్‌బోర్డుకు మాత్రమే ఉన్నాయని తేటతెల్లమైంది.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E. P.No. 61 / 2018
O.S.No.: 163 / 2017

యనమదల రత్నమ్మ ...డిక్రీ హోల్డరు

వర్సెస్

మణిమాల రమాదేవి ...జడ్జిమెంట్ డెబ్టర్

నోటీసు

U/Order.21 Rule.66 CPC

టు:మణిమాల రమాదేవి, భర్త వేలాయుధం, మీ సేవ వెనుక, బస్టాండ్ సమీపంలో, కలిచేడు గ్రామం, సైదాపురం మండలం, ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా.

ఇందుమూలముగా మీకు తెలియచేయడము ఏమనగా పై నెంబర్ కేసు నందు డిక్రీ హోల్డరు డిక్రీ బాకీ రాబట్టుకొనుటుకు దరఖాస్తు దాఖలు చేసుకోగా పై నెంబర్ కేసు నందు మీకు పలుమార్లు U/Order.21 Rule.66 నోటీసు పంపినను జారికానందున గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వారు మీకు నోటీసు నిమిత్తం 16-09-2025వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున మీకు ఎట్టి అభ్యంతరములు ఉన్నయెడల పై తెలిపిన కోర్టు నందు 16-09-2025వ తేదీ ఉదయం గం.10-30 లకు స్వయంగా కానీ వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా నీ పరోక్షమున తీర్మానించబడును.

పట్నం. శ్రీనివాసులు, ఎం.కామ్., ఎల్.ఎల్. బి
డి హెచ్ ఆర్ తరుపు న్యాయవాది
గూడూరు